క్లుప్తంగా

కపిలేశ్వరపురం ఎంపీడీఓగా భానూజీ



ఎంపీడీఓ భానూజీని మర్యాదపూర్వకంగా కలిసిన ఏఓ రాజేంద్రప్రసాద్, సిబ్బంది

కపిలేశ్వరపురం: మండల ఎంపీడీఓగా హెచ్ భానూజీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా రావికమతం మండలంలో డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఎంపీడీఓగా కపిలేశ్వరపురం వచ్చారు. ఇప్పటి వరకూ ఎంపీడీఓ కార్యాలయ కార్యనిర్వహణాధికారి జి.రాజేంద్రప్రసాద్ ఎంపీడీఓ బాధ్యతలను నిర్వహించారు. మండలంలోని గ్రామాల అభివృద్ధి తనవంతు కృషి చేస్తానని ఎంపీడీఓ భానూజీ తెలిపారు.

చలో అసెంబ్లీని విజయవంతం చెయ్యండి



కాజులూరులో చలో అసెంబ్లీ కార్యక్రమానికి రైతులను ఆహ్వానిస్తున్న కౌలురైతు సంఘం నేతలు

కాజులూరు: నూతన కౌలు చట్టాన్ని తీసుకు వచ్చి, అన్నదాత సుఖీభవ డబ్బులు కౌలురైతు ఖాతాల్లో జమ చెయ్యాలని కోరుతూ ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22వ, తేదీ సోమవారం చేపట్టనున్న చలో అసెంబ్లీని విజయవంతం చెయ్యాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో కౌలురైతు సంఘం నాయకులు పర్యటించి కరపత్రాలు పంచుతూ కార్యక్రమానికి హాజరు కావాలని రైతులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకూ కౌలురైతు చట్టాన్ని సవరించి రైతులతో సమానంగా కౌలురైతులకు అన్ని ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, అన్నదాత సుఖీభవ డబ్బులు కౌలురైతు ఖాతాల్లో జమ చెయ్యాలని కోరుతూ విజయవాడ నుంచి అమరావతి అసెంబ్లీకి ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు.

పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు



పామర్రు ఎస్సీ కాలనీ కాలువలో పూడిక తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

కె.గంగవరం: నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో దోమల నియంత్రణ, పారిశుధ్య నిర్వహణపై 'కంటి మీద కునుకు లేదాయె' శీర్షికతో శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల ఎంపీడీఓ ఎన్. శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ యేసురత్నం ఆదేశాలతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు తక్షణ చర్యలు చేపట్టారు. పేరుకున్న చెత్తను ప్రొక్లెయిన్లతో తొలగించారు. కాలువల్లోని ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్‌కు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పశువుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పెదలంకలో సీజనల్ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారులు

కాజులూరు: పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ, డీఎల్డీఏ కార్యనిర్వహణ అధికారి కాంతారావు అన్నారు. మండలంలోని పెద్దలంక గోశాల వద్ద శుక్రవారం జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో ఉచిత గర్భ కోశ వ్యాధుల ఉచితపశు వైద్య శిబిరం నిర్వహించారు. వంద పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాడి రైతులకు మినరల్ మిక్సర్, మందులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా డీఎల్డీఏ ఈవో మాట్లాడుతూ పశువులకు వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అంబేద్కర్, ఏడీఏ బ్రహ్మవేద, పశువైద్యాధికారులు చెక్కపల్లి శ్రీరామ్, సుధీర్ సామ్యూల్, పశు వైద్య సహాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

పశువుల సంచారం.. ప్రాణ సంకటం

- రహదారులపై పశువుల స్వైరవిహారం
- భయాందోళనకు గురవుతున్న వాహనచోదకులు
- రాత్రి సమయాల్లో రోడ్లపైనే నిద్రిస్తున్న ఆవులు, గేదెలు
- పట్టించుకోని పశువుల యజమానులు, అధికారులు



గొల్లపాలెంలో ప్రధాన రహదారిపై రాత్రి వేళలో సంచరిస్తున్న గేదెలు, ఆవులు



గొల్లపాలెంలో ఆవును ఢీకొని మృతిచెందిన కళా సత్యనారాయణ (ఫైల్)



ఆర్యావటంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొని మృతి చెందిన చూడి ఆవు (ఫైల్)

కాజులూరు: పదుల సంఖ్యలో పశువులు నిత్యం రోడ్లపైనే సంచరిస్తున్నాయి. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా విశాలంగా ఉండే రహదారులను ఆక్రమించుకుని మకాం పెట్టేస్తుండటంతో వాహనచోదకులు తీవ్ర అగచాట్లకు గురవుతున్నారు. ఒకప్పుడు పట్టణాలకు మాత్రమే పరిమితమైన బహిరంగ పశువుల సంచారం నేడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. నియోజకవర్గంలో ప్రధాన గ్రామాలతోపాటు పలు చిన్న పల్లెల్లోనూ గేదెలు, ఆవులను మేపుకునే కొందరు స్థానికులు పాలు తీసుకుని వాటిని గ్రామంలో ఆరుబయట మేతకు వదలివేస్తున్నారు. రాత్రి సమయాల్లో అవి రోడ్లపై సంచరిస్తూ రహదారి మధ్యలో నిద్రిస్తున్నాయి. దీంతో వేగంగా వచ్చే వాహనచోదకులు ఈ పశువులను ఢీకొని తీవ్ర ప్రమాదాల పాలవుతున్నారు. కొన్ని సందర్భాల్లో వాటిలో అవే పశువుల పోట్లాటకు దిగి ప్రయాణికులపై పడుతున్నాయి.

ప్రమాదాలు నిత్యకృత్యం

ముఖ్యంగా కాకినాడ, కోటిపల్లి రహదారిపై కాజులూరు మండలం గొల్లపాలెం వద్ద రోడ్డుపై పశువుల సంచారం ప్రయాణికులకు తీవ్ర ప్రమాదభరితంగా మారింది. ఆర్యావటం దొరగారి మలుపు నుంచి గొల్లపాలెం ధనమ్మతల్లి ఆలయం మధ్యలో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. పశువులను ఢీకొని ఎందరో వాహనదారులు క్షతగాత్రులవుతున్నారు. కొన్ని సందర్భాల్లో పలువురు తీవ్ర గాయాల పాలై మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల గొల్లపాలెం సుబ్రహ్మణ్యంస్వామి ఆలయం వద్ద తణుకువాడకు చెందిన కళా సత్యనారాయణ రోడ్డుపై వెళుతూ ఆవుని ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల ఫిర్యాదుల మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని కాకినాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆర్యావటంలో ఆవు దూడను ఒక గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోవడంతో ఆ దూడ తీవ్ర గాయాలైంది. గొల్లపాలెంలో వాహనం ఢీకొని చూడి ఆవు మృత్యువాత పడింది. గతంలో పట్టణాల్లో పశుగ్రాసం కొరత కారణంగా బహిరంగ పశువుల సంచారం ఉండేది. ఇప్పుడు గ్రామాల్లోనూ వీధుల్లో, రోడ్లపై పశువుల సంచారం అధికమైంది. కొందరు స్వార్థపరులు ఆవులు, గేదెలను కొని పాలు తీసుకుంటూ వాటిని గాలికి వదలివేస్తుండటంతో అవి రోడ్లపై సంచరిస్తూ ప్రయాణికులు, స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ఫిర్యాదు చేసినా స్పందన కరవు

రహదార్లపై పశువుల సంచారంపై గ్రామ పంచాయతీ అధికారులకు, పోలీసులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆవుల యజమానులు వాటిని కట్టడి చేసుకునేలా హెచ్చరికలు జారీ చెయ్యాలని అప్పటికీ వినని పక్షంలో వాటిని పట్టి గోశాలకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



రహదారులపై పశువుల సంచారం వలన తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి. యజమానులను గుర్తించి వారికి నోటీసులు జారీ చెయ్యాలి.

– పెంకే సత్యనారాయణ, ప్రయాణీకుడు, కాజులూరు

ఆవులను గోశాలకు తరలించాలి



రోడ్లపై పశువుల బహిరంగ సంచారంపై పలు మార్లు ఫిర్యాదు చేస్తున్న అధికారులు పట్టించుకోవటం లేదు. అధికారుల ఆదేశాలను యజమానులు బేఖాతరు చేస్తున్న తరుణంలో వాటిని పట్టి గుర్తింపు పొందిన గోశాలకు తరలించాలి.

– కేశన వీర్రాజు ప్రయాణీకుడు, అంద్రంగి

మాజీ మంత్రి వేణుకు నోటీసు జారీ



రామచంద్రపురంలో మాజీ మంత్రి వేణుకు నోటీసులు అందజేస్తున్న పోలీసులు

రామచంద్రపురం: రాష్ట్ర మాజీ మంత్రి, తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు గురువారం రాత్రి పోలీసులు నోటీసులు అందించారు. వైద్య కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటు పరం చేస్తున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు వైద్య కళాశాలల సందర్శన కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమం జరగకుండా అడ్డుకునేందుకు మాజీ మంత్రి వేణుకు రామచంద్రపురంలోని వేణు ఇంటి వద్దకు పోలీసులు చేరుకుని ఆయనకు నోటీసులు అందజేశారు.

మండపేట-దుళ్ల రోడ్డును అభివృద్ధి చేయాలి

కపిలేశ్వరపురం (మండపేట): నియోజకవర్గ కేంద్రమైన మండపేట- మేజర్ పంచాయతీ అయిన దుళ్ల మధ్య రహదారిని అభివృద్ధి చేయాలని మున్సిపల్ కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోతైన గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. వాణిజ్య కేంద్రమైన రాజమహేంద్రవరం వెళ్లే ద్విచక్ర వాహహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఈ హదారి మీదుగా పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులు తరలిస్తుంటారని, పరిశ్రమల్లో పనిచేసే శ్రామికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని రవికుమార్ డిమాండ్ చేశారు.

పార్లమెంటరీ విలువలపై 25న సదస్సు

కపిలేశ్వరపురం: ఈ నెల 25న రామచంద్రపురంలోని చెలికాని రామారావు భవనంలో 'సంక్షోభంలో పార్లమెంటరీ విలువలు–మన కర్తవ్యం' అంశంపై సదస్సు నిర్వహించనున్నట్టు సామాజిక కార్యకర్త గౌరవ్ శుక్రవారం అంగరలో తెలిపారు. డాక్టర్ చెలికాని రామారావు స్మారక కమిటీ నిర్వాహకులు డాక్టర్ చెలికాని స్టాలిన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సదస్సులో ఉస్మానియా విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ సి.కాశీం, సహకార రంగ ఉద్యమ నాయకుడు మానం ఆంజనేయులు ప్రసంగిస్తారని గౌరవ్ తెలిపారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

కపిలేశ్వరపురం: కేంద్ర ప్రభుత్వం సహకారంతో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా శుక్రవారం పలు గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. డాక్టర్ రమణమూర్తి ఆధ్వర్యంలోని పశువైద్య శాఖ సిబ్బంది నల్లూరులో 272 పశువులకు టీకాలు వేశారు. వైద్యులు మాట్లాడుతూ 20న టేకి, 22న వెదురుమూడి, 23న పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, 24న అంగర, కేదారిలంక, 25న అద్దంకివారిలంకలో టీకాలను వేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయవరం: బ్రాహ్మణ సేవా ట్రస్టు ద్వారా ఏటా ఇచ్చే ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ విషయాన్ని బ్రాహ్మణ సేవా ట్రస్ట్ చైర్మన్ దంతుర్తి సత్యప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 30వ తేదీలోగా మెరిట్ కలిగి ఉండి, ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 9849592523 నంబరుకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

ఏడిదలో విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కపిలేశ్వరపురం (మండపేట): ఏడిద, ఏడిద సీతానగరం గ్రామాల్లో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు రామచంద్రపురం విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారి కె.రత్నాలరావు శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

పెద్దమ్మ తల్లికి విశేష పూజలు

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని పెద్దమ్మ తల్లికి శుక్రవారం విశేష పూజలు చేశారు. తెల్లవారుజామున భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ చైర్మన్ వాలిన వీరబాబు మాట్లాడుతూ 22న కలశ స్థాపన, 26న లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆలయం వద్ద అమ్మవారి అన్న ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు.

ద్వారపూడిలో బోయి భీమన్న జయంతి

కపిలేశ్వరపురం (మండపేట): ద్వారపూడిలోని మదర్ అసోసియేషన్ ఆఫ్ అవేర్నెస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మహాకవి బోయి భీమన్న 111వ జయంతిని నిర్వహించారు. అభ్యుదయ రచయిల సంఘం జిల్లా అధ్యక్షుడు గండి స్వామి ప్రసాద్, జన విజ్ఞాన వేదిక అనుబంధ రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ కమిటీ కో కన్వీనర్ చిలుకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ బోయి భీమన్న రచనలు సమాజానికి మేల్కొలుపు అన్నారు. ఈ కార్యక్రమంలో కవులు బండారు రాము, తూలూరి నరేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు



అమలాపురంలో వైద్య కళాశాల భవనం వద్ద నినదిస్తున్న మండపేట నాయకులు, విద్యార్థి, యువజనులు

- కూటమి ప్రభుత్వాన్ని చరిత్ర క్షమించదు
- అమలాపురంలో వైఎస్సార్ సీపీ నేతల ఆందోళన

కపిలేశ్వరపురం: గత ప్రభుత్వం స్థాపించిన ప్రజా వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే చరిత్ర కూటమి ప్రభుత్వాన్ని క్షమించదని మండపేట నియోజకవర్గం వైఎస్సార్ సీపీ నేతలు, విద్యార్థి, యువజన విభాగం నేతలు స్పష్టం చేశారు. పార్టీ అధినాయకత్వం పిలుపు మేరకు శుక్రవారం «చలో మెడికల్ కళాశాల» కార్యక్రమంలో పాల్గొనేందుకు మండపేట పట్టణం, రూరల్, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల నుంచి యువజన విద్యార్థులు అమలాపురం తరలివెళ్లారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు శుక్రవారం అమలాపురం సమీపంలోని కామనగరువులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల భవనం వద్ద నిరసన తెలిపారు. నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం సహాయ కార్యదర్శి పోతుల దుర్గాప్రసాద్, నియోజకవర్గ కన్వీనర్ అబ్బిరెడ్డి వీర్రాజు, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి అర్జున్, నియోజకవర్గ కన్వీనర్ బోడే శ్రీకృష్ణ పర్యవేక్షణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండపేట చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ వైద్య కళాశాలలను పూర్తి చేసి సామాన్య ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం ప్రభుత్వ నిర్వహణలో ఉండటం ద్వారానే సామాన్య ప్రజలకు మేలు కలుగుతుందని గత వైఎస్సార్ సీపీ నూతన మెడికల్ కళాశాలలను స్థాపించిందన్నారు. వాటిని పూర్తి చేసి వినియోగంలోకి తేవాల్సిన కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరించాలన్న నిర్ణయం వల్ల కార్పొరేట్లకు మేలు చేయడమే అవుతుందన్నారు. కార్యక్రమంలో పలివెల మధు, సుధాకర్, సిరిపురపు శ్రీనివాస్, పిల్లి శ్రీనివాస్, పాలింగి శ్రీనివాస్, నీలం దుర్గ, యరమాటి వెంకన్నబాబు, మారిశెట్టి సత్యనారాయణ, మారిశెట్టి సత్యనారాయణ, బిల్లకుర్తి అంజి, ఎస్. శివభగవాన్ పాల్గొన్నారు.

ద్రాక్షారామలో దస్తావేజు లేఖర్ల నిరసన



ద్రాక్షారామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖర్లు

రామచంద్రపురం రూరల్: రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖరులు 19, 20 తేదీల్లో చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా ద్రాక్షారామలో దస్తావేజు లేఖర్లు శుక్రవారం స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద టెంటు వేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్లు, సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాల వలన దస్తావేజు తయారీ జటిలమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన తీవ్ర జాప్యం కావడంతోపాటు ఇటు ప్రజలకు, దస్తావేజు లేఖర్లకు విలువైన సమయం వృథా అవుతోందన్నారు. ఈ విధానాల్లో ప్రభుత్వం తక్షణం ఈ మార్పులు చేపట్టాలని డిమాండ్‌తో నినాదాలు చేశారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన అవసరం



కపిలేశ్వరపురంలో మహిళా ఆరోగ్య రక్షణపై మాట్లాడుతున్న డాక్టర్ రత్నకుమారి

కపిలేశ్వరపురం: ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన అవసరమని, ఆ లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం «స్వస్థ్ నారీ– సశక్త్ పరివార్ అభియాన్» పేరుతో ప్రత్యేక ఆరోగ్య ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కపిలేశ్వరపురం గ్రామ సచివాలయం వద్ద ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ సాకా శ్రీనివాస్ శిబిరాన్ని ప్రారంభించగా అతిథులుగా ఎంపీటీసీ సభ్యులు శీలం భాస్కరరావు, నాయకులు హాజరయ్యారు. ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.రామారావు మాట్లాడుతూ మహిళలకు బీపీ, సుగరు, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లపై అవగాహన కల్పించారు.ఆరోగ్యవంతమైన మహిళలు – బలమైన కుటుంబాలు లక్ష్యంగా అక్టోబర్ 2 వరకూ కార్యక్రమాన్ని కొనసాగించనున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కొండపల్లి శివచక్రవర్తి, ఎంపీహెచ్ఎస్ నానిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి, హెచ్‌వీ టి.మేరీమణి, వైద్య, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

కాజులూరు: ఆరోగ్యకరమైన మహిళలు ఆ కుటుంబానికి వెన్నుముకలాంటివారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం గొల్లపాలెంలో నిర్వహించిన స్వస్థ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో అడబాల పాల్గొన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ జి.సౌజన్య, డాక్టర్ జీవీఎల్ శ్రేయ, ప్రసూతి వైద్యనిపుణులు సానియా సుల్తానా, జనరల్ ఫిజీషియన్ అశ్విని తదితర వైద్యులు శిబిరానికి వచ్చిన 178 మందికి వైద్యసేవలు అందించారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అపోలో ఆసుపత్రి సౌజన్యంతో టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దూడల శంకర్‌నారాయణ, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ రొక్కాల సత్తిబాబు, స్థానిక పీఏసీఎస్ చైర్మన్ అంగర కృష్ణ, అంగర శ్రీను, నక్కా శ్రీను పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ, ఏరుపల్లి గ్రామాల్లో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ– సశక్త్ పరివార్ క్యాంపులు నిర్వహించారు. ద్రాక్షారామలో డాక్టర్ రత్న సుధ, డాక్టర్ సందీప్ నాయుడుల ఆధ్వర్యంలో, ఏరుపల్లిలో డాక్టర్ వి. స్వాతి భవాని, డాక్టర్ లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో మహిళలు, కిశోర బాలికలను స్క్రీనింగ్ చేయడం, క్షయ వ్యాధి పరీక్షలు, గర్భిణులకు ప్రసూతి పరీక్షలు, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, చిన్న పిల్లలకు వ్యాక్సిన్లు వంటి వైద్య సేవలను అందించారు. అవసరమైన రక్త పరీక్షలు చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారంపై ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, నాగిరెడ్డి సతీష్‌రావు, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, డివిజనల్ మెడికల్ సూపర్‌వైజర్ జి. కమల్ శేషు, సూపర్‌వైజర్లు కె. నాగమణి, పి.శివశంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై వీఆర్ఏల ఆందోళన



కపిలేశ్వరపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెండో రోజు ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

కపిలేశ్వరపురం: ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపు మేరకు తమ డిమాండ్ల సాధనకై మండలంలోని వీఆర్ఏలు శుక్రవారం రెండో రోజు ధర్నా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో మండలంలోని 19 గ్రామాల వీఆర్ఏలు పాల్గొన్నారు. సంఘం కపిలేశ్వరపురం మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలివెల నాగేశ్వరరావు, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నామినీలను వీఆర్ఏలుగా నియమించాలని, అర్హులైన వీఆర్ఏలను అటెండర్, వీఆర్ఓ, నైట్ వాచ్‌మెన్, డ్రైవర్ తదితర పోస్టులతో భర్తీ చేయాలని, కారుణ్య నియామకాలను చేపట్టాలని, పే స్కేల్‌ను అమలు చేయాలన్నారు. ఆందోళన కొనసాగింపులో భాగంగా శనివారం రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్టు తెలిపారు.

కాజులూరు: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాజులూరు తహశీల్దారు కార్యాలయం ఎదుట రెండు రోజులుగా మండల వీఆర్ఏలు చేపట్టిన నిరసన కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. మండల గ్రామాలకు చెందిన వీఆర్ఏలు, ఇతర రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో భీమేశ్వర దంత వైద్యశాల డాక్టర్ బచ్చు క్రాంతికుమార్ ఇంటిలో శుక్రవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించిందని రామచంద్రపురం ఫైర్ ఆఫీసర్ కర్రి వెంకటరెడ్డి తెలిపారు. వైద్యుడు క్రాంతికుమార్, ఆయన సతీమణి నాగశేషుకుమారి భవనంలోని కింది అంతస్తులో దంత వైద్యశాలలో ఉండగా, పిల్లలు స్కూలుకు వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. షార్టు సర్క్యూట్ కారణంగా ఏసీలో మంటలు చెలరేగి గదిలోని మంచం, దివాన్ కాట్‌కు వ్యాపించడంతో మొత్తం ఇంటిలోని సామాగ్రి కాలిపోయింది. సుమారు రూ. 2 లక్షలు వరకు ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేసినట్లు ఫైర్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణ, ద్రాక్షారామ ఏపీసీఎస్ చైర్మన్ ముప్పనపల్లి గణేష్, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం తదితరులు డాక్టర్ క్రాంతికుమార్ దంపతులను పరామర్శించారు.

గొడవ నేపథ్యంలో ఇరు వర్గాలపై కేసులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో ఈ నెల 11న జరిగిన గొడవకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదులతో గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం. లక్ష్మణ్ శుక్రవారం తెలిపారు. ద్రాక్షారామ శుక్రవారపుపేటకు చెందిన అలీ అస్కర్‌కు అతడి తమ్ముడు ఫోన్ చేసి ఆగావారి వీధిలో గొడవ జరుగుతోందని తెలపడంతో ఆయన అక్కడికి వెళ్లాడు. జీసన్, షానూర్, సయ్యద్ ఫాజిల్ దాడి చేశారని అలీ అస్కర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే గొడవలో జీసన్ అబ్బాస్ తన ఇంటి ముందు ఒక కుటుంబం గొడవ పడుతోందని, ఆ సమయంలో షేక్ కరీముల్లా, అలీ ఆఘా, బుజ్జి, అస్కర్ అనే వ్యక్తులు ఇంటి తలుపు గెంటి తన తల్లిపై దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఇరువర్గాల ఫిర్యాదుల నేపథ్యంలో కేసులను దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆస్తి పన్ను వసూలుపై శ్రద్ధ వహించాలి



మండపేట మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఆర్‌డీ నాగనరసింహారావు

కపిలేశ్వరపురం (మండపేట): ఉమ్మడి జిల్లాలోని అన్ని నగరాలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఆస్తి పన్ను వసూలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆ దిశగా ఉన్నతాధికారులు చేస్తున్న సూచనలను విధిగా పాటించాలని రాజమహేంద్రవరం పురపరిపాలనా శాఖ రీజినల్ డైరెక్టర్ కం అప్పిలేటు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 10 నగర, మున్సిపాలిటీల, నగర పంచాయతీల అధికారులతో సమావేశమయ్యారు. కాకినాడ, రాజమహేంద్రపురం నగరాలు, అమలాపురం, పెద్దాపురం, పిఠాపురం, సామర్లకోట, మండపేట, రామచంద్రపురం, తుని మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీల కమిషనర్లు, పట్టణ ప్రణాళికాధికారులు, రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సర్వేలపై పలు సూచనలు చేశారు. అనంతరం మున్సిపాలిటీల వారీగా రెవెన్యూ వసూలు తీరును సమీక్షించి మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, మున్సిపల్ మేనేజర్ బి.రవికిరణ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, ఆర్ఐ జీవీ ఎస్ శాస్త్రి, పట్టణ ప్రణాధికాధికారి కె.రమ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి సత్కారం

కపిలేశ్వరపురం: స్థానిక కోరాటివారి వీధి ప్రాథమిక పాఠశాలలో ఎనిమిదేళ్ల పాటు విద్యా బోధన చేసి సత్యనారాయణపురం పాఠశాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు ఇల్లూరి సూరిబాబును శుక్రవారం ఘనంగా సత్కరించారు. కోరాటివారి వీధి పాఠశాల హెచ్ఎం సీహెచ్. టిచంద్రమౌళి, ఉపాధ్యాయులు సత్య ప్రియాంక, ఎస్ఎంసీ చైర్మన్, తల్లిదండ్రులు ఉపాధ్యాయుడు సూరిబాబు సేవలను కొనియాడారు. పాఠశాల పూర్వ విద్యార్థిని, ఇటీవల కానిస్టేబుల్‌గా ఎంపికైన నూకపెయ్యి ఆలేఖ్యను సత్కరించారు. పలు పాఠశాలల హెచ్ఎంలు వై కోటేశ్వరరావు, శీలం సత్యనారాయణ మూర్తి, జి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.